క్లుప్తంగా

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి

గరుగుబిల్లి: పుస్తక పఠనంపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని లైబ్రేరియన్ నల్ల మధుసూదనరావు సూచించారు. మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులతో పుస్తకాలు, పత్రికలు చదివించి, వాటిని ఏ విధంగా చదివి అర్థం చేసుకోవాలో లైబ్రేరియన్ తెలిపారు. నీతికథలు, ప్రముఖుల జీవిత చరిత్రలు చదివి ఆదర్శవంతమైన జీవనం సాగించాలని ఆయన కోరారు.

నమ్మకంతో జీవించాలి

పాలకొండ: ప్రతిఒక్కరూ భగవంతునిపై నమ్మకంతో జీవించాలని సత్యసాయి ప్రతినిధి ఎన్వీ రమణ అన్నారు. మండలంలోని బెజ్జి గ్రామంలో గీతా పారాయణ సత్సంగ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్త ప్రాణుల యందు ద్వేషం లేకుండా కరుణ చూపించాలన్నారు. అనంతరం నారాయణ సేవ నిర్వహించారు.

వరిచేను కోతలో జాగ్రత్తలు పాటించాలి

సీతానగరం: రెండు రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాల కురుస్తున్న కారణంగా మండలంలోని రైతులు వరిచేను కోత విషయమై జాగ్రత్తలు పాటించాలని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ వరిచేను కోత కోయకుండా నిలవరం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, వరిచేను కోయడం వల్ల ధాన్యం మడులలో రాలిపోయే అవకాశం ఉందన్నారు. వరిచేను కోత దశకు వచ్చినప్పుడు వర్షాలు కురుస్తున్నందున కోసిన వరిచేను మడులలో నీట మునగడం, ధాన్యం రాలి పోవడం జరుగుతుందన్నారు. మడులలో వరిచేను కోయకుండా నిలవరం ఉన్నందున ఎటువంటి నష్టం వాటిల్లదని తెలియజేశారు. కోసిన వరిచేను మడులలోనే కుప్పలు వేయాలని సూచించారు.

వంతెన పనుల పరిశీలన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదిపై నిర్మాణం జరుగుతున్న పనులను ఎమ్మెల్యే బి.విజయచంద్ర ఆదివారం పరిశీలించారు. వంతెనకు ఇరువైపులా నిర్మాణం జరుగుతున్న రక్షణ గోడలపనులు, ఎప్రోచ్ రోడ్డు పనులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉండాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. పాత వంతెన శిథిలావస్థకు చేరుకున్న కారణంగా వంతెన పనులు వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్టరుకు సూచించారు. కార్యక్రమంలో వంతెన కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులు, టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

ఆనంద 'దీపావళి'కి భద్రతే కీలకం



జిల్లా అగ్నిమాపక శాఖాధికారి సింహాచలం

పార్వతీపురం రూరల్: దీపావళి పండగను ప్రజలు సురక్షితంగా, సంతోషంగా జరుపుకోవాలని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి పి.సింహాచలం సూచించారు. అగ్నిప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ భద్రతా నియమాలు పాటించాలన్నారు. టపాసులు కాల్చేటప్పుడు వదులైన సింథటిక్ దుస్తులకు బదులు బిగుతైన కాటన్ దుస్తులనే ధరించాలని, ఇళ్లు, గుడిసెలు, వాహనాలకు దూరంగా బహిరంగ మైదానాల్లో మాత్రమే టపాసులు కాల్చాలని సూచించారు. సమీపంలో తప్పనిసరిగా బకెట్లతో నీటి నిల్వలు, ఇసుక ఉంచుకోవాలన్నారు. చిన్నారులను పెద్దల పర్యవేక్షణలోనే ఉంచాలని, టపాసులను చేతితో పట్టుకొని వెలిగించడం వాటిపై వంగి చూడడం వంటివి అత్యంత ప్రమాదకరమని, అగర్‌బత్తీ లేదా పొడవాటి కాకరొత్తులతో మాత్రమే వెలిగించాలని, పేలని వాటిని తిరిగి వెలిగించే ప్రయత్నం చేయరాదన్నారు. ప్రమాదం సంభవిస్తే వెంటనే 101కి సమాచారం అందించాలని ఆయన కోరారు.

కమిటీలతో పార్టీని బలోపేతం చేయాలి

పార్వతీపురం రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గం వ్యాప్తంగా పార్టీ గ్రామ, వార్డు కమిటీల నియామకాలను సత్వరమే పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆయన పార్వతీపురం మండలంలోని వెంకంపేట గ్రామంలో పర్యటించి పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నూతన కమిటీలు కీలకమన్నారు. కమిటీల సభ్యులంతా సమన్వయంతో పనిచేస్తూ, భవిష్యత్ కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని సూచించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజల పక్షాన నిలబడి పోరాటం సాగించాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా శ్రమించి పాటుపడాలని పిలుపునిచ్చారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునే దిశగా అడుగులు వేయాలని జోగారావు దిశానిర్దేశం చేశారు.

పచ్చదనం..మనసుకు హాయిదనం!



వరి పొలాలు పచ్చదనంతో శోభిల్లుతున్నాయి. ఏ గ్రామ పొలాలు చూసినా పచ్చని పైరుతో అందంగా మనసుకు హాయిదనాన్ని పంచుతున్నాయి. అటువైపుగా వెళ్లే వారంతా కనుచూపు మేర నెలకొన్న పచ్చదనం చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పల్లె అందాలు ఎవరి మనసునైనా ఇట్టే కట్టిపడేస్తాయని అంటున్నారు. కురుపాం మండలంలోని గుమ్మ నుంచి పి.లేవిడి మీదుగా గుమ్మలక్ష్మీపురం వెళ్లే దారిలో నేలతల్లికి పట్టుచీర కట్టినట్లుగా కనిపిస్తున్న పచ్చదనాన్ని ఈ చిత్రంలో చూడొచ్చు. -గుమ్మలక్ష్మీపురం

రోడ్డుపైకి మురుగునీరు..



గురుగుబిల్లి మండలం, రావుపల్లి చుక్కవాని వీధి రోడ్డుపైకి మురుగునీరు వచ్చేస్తోంది. ఇదే వీధిలో గతంలో సీసీ రోడ్డు నిర్మించినప్పటికీ కాలువ నిర్మాణం చేపట్టకపోవడంతో గ్రామంలోని పలు వీధుల నుంచి వస్తున్న మురుగు అంతా ఈ వీధి రోడ్డు పైనే నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమలు, ఈగలు పెరిగి జ్వరాల బారినపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా కాలువ నిర్మించాలని కోరుతున్నారు. -గరుగుబిల్లి

అన్నదాత ఆందోళన



అకాల వర్షాలు అన్నదాతను ఆందోళనలోకి నెట్టేస్తోంది. ఎప్పుడు వర్షం కురుస్తుందో చెప్పలేని పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయి. ఉదయం బాగా ఉన్న వాతావరణం రాత్రి వరకు ఎలా ఉంటుందో చెప్పలేకపోతున్నాం. ఎప్పుడు మబ్బులు వేస్తున్నాయో.. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఆదివారం ఒక్కసారి వాతావరణం మారిపోయింది. చాలాచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిశాయి. ఈ నేపథ్యంలో మొక్కజొన్న రైతులు రోడ్లు, కళ్లాల్లో ఆరబెట్టిన మొక్కజొన్న గింజలను గోనె సంచుల్లోకి ఎత్తి భద్రపరిచే పనిలో నిమగ్నమయ్యారు. గుమడ గ్రామంలోని రైతులు ఇలా మొక్కజొన్న పంటను రక్షించుకునే చర్యలను ఈ చిత్రంలో చూడొచ్చు. -కొమరాడ

గుమ్మడి గింజంత నిజమైనా మాట్లాడవా?

- మంత్రి సంధ్యారాణి తీరుపై మాజీ ఉపముఖ్య మంత్రి పాముల పుష్పశ్రీవాణి మండిపాటు



మాట్లాడుతున్న మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస రూరల్: కురుపాంలో గిరిజన విద్యార్థుల మరణాలపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వ్యవహరిస్తున్న తీరుపై మాజీ ఉపముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాముల పుష్పశ్రీవాణి మండిపడ్డారు. మండలంలోని చినమేరంగి గ్రామంలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆమె..గిరిజన మంత్రి అని చెప్పుకుంటున్న మీరు..గిరిజన విద్యార్థుల మరణాలపై ఎందుకు అసత్యాలు ప్రచారం చేస్తున్నావని నిలదీశారు. ఇటీవల మీడియా సమావేశం ఏర్పాటు చేసిన మీరు.. కురుపాంలో ఇద్దరు గిరిజన విద్యార్థులు చనిపోయారు..11 మంది చనిపోయారని వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతున్నది అబద్ధమని పత్రికా ముఖంగా తెలియజేయడం సిగ్గు అనిపించడం లేదా అని అన్నారు. విద్యార్థుల మరణాలపై కనీస అవగాహన లేకుండా అజ్ఞానంతో మాట్లాడడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలోని వివిధ ఆశ్రమ పాఠశాలలకు చెందిన 11 మంది విద్యార్థులు డి.ఈశ్వరరావు, పి.రాఘవ, కె.శారద, ఎస్.అవంత్, ఎస్.నితిన్, జీవన్‌కుమార్, దినేష్, పి.దినేష్, కె.తనూజ, అంజలి, కల్పనలు చనిపోతే ఈ తప్పును ఒప్పుకోకపోవడమే కాకుండా అబద్ధాలు మాట్లాడడం సిగ్గనిపించడం లేదా అని అన్నారు. తమ తప్పును కప్పిపుచ్చడానికి గత ప్రభుత్వ హయాంలో 118 మంది చనిపోయారని చెప్పడం దురదృష్టకరమన్నారు. తప్పుడు ప్రచారాలతో నిజాలను ఎప్పుడూ దాచలేరన్నారు. ఇటీవల ఇద్దరు గిరిజన విద్యార్థులు పచ్చకామెర్లుతో చనిపోయి మరో 200 మంది విద్యార్థులు పచ్చకామెర్లతో ఆస్పత్రిపాలైతే గిరిజన మంత్రిగా మీరేం బాధ్యత తీసుకుని బాధిత కుటుంబాలకు భరోసానిచ్చారని ధ్వజమెత్తారు. 611 మంది విద్యార్థులు ఇరుకు గదుల్లో ఉన్నారని, తాను ఎక్కడ ఎవరితో అన్నానో చెప్పాలని, ఇలాంటి అవాకులు మీ తెలివైన ఎమ్మెల్యే మాట్లాడిందని ఒకసారి చెవులు పెద్దవి చేసుకుని వినాలన్నారు. అదనపు గదుల కోసం మా ప్రభుత్వంలో ఈఐ గ్రాంట్ కింద రూ.5 కోట్లను జనవరి 2020లో జీఓ నంబర్ ఆర్‌టీ 16 టీఎస్పీ నిధులు విడుదల చేశారని, అలాగే మే 2020 కోటి 97 లక్షల రూపాయలు, మే 2020లో మళ్లీ డ్రైనేజీల నిమిత్తం నాబార్డుతో కలిపి రూ.20 లక్షలు మంజూరు చేశామన్నారు. తెలియకపోతే అధికారుల నుండి నోట్ తెప్పించుకుని చూసి మరీ మాట్లాడాలే తప్ప ఇష్టానుసారంగా ఏమీ తెలుసుకోకుండా మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు.

ఐటీడీఏలెన్ని ఉన్నాయో తెలుసా?

కురుపాంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ పనులు జరుగుతుంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మాణం ముందుకు కదలలేదని ఆరోపించారు. అంతేకాకుండా వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఐటీడీఏలను నిర్వీర్యం చేశారని ఆరోపించారని, అసలు ఐటీడీఏల నిర్వీర్యమంటే ఏమిటో తెలుసా అని ఎదురు ప్రశ్న వేశారు. ఐటీడీఏలు ఎన్ని ఉన్నాయో ఎక్కడెక్కడ ఉన్నాయో తమరకు తెలుసా అని ఎద్దేవా చేశారు. ఎప్పుడైనా చింతలూరు, శ్రీశైలం, నెల్లూరు, పోలవరం ఐటీడీఏలకు వెళ్లారా అని అడిగారు. ఐటీడీఏలు నిర్వీర్యమైతే సమావేశాలు, సమీక్షలు ఎలా జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లో 100 గ్రామాలకు 100 రోడ్లు వేశామని అదేదో గొప్ప విజయమని అసత్యాలు చెప్పడం సరికాదన్నారు. అసలు ఒక రోడ్డుకు ఎస్టిమేషన్ ప్రాసెస్, గ్రౌండ్ వర్క్ కావాలంటే కనీసం నాలుగు నెలలైనా పడుతుందన్న విషయం మీకు తెలుసా అని ప్రశ్నించారు. గాలిమాటలు కట్టిపెట్టి వాస్తవాలను మాట్లాడితే కనీస గౌరవమైనా ఉంటుందన్నారు. అంతెందుకు మీ సొంత నియోజకవర్గంలో మీ కోసం మీ అవినీతి కోసం ప్రజలు, గిరిజనులు ఏం మాట్లాడుకుంటున్నారో తెలిస్తే చెవుల వెంట రక్తం కారుతుందన్నారు. మీ అవినీతి చిట్టాను సిద్ధం చేస్తున్నామని గురుకులం, ఏకలవ్య పాఠశాలల్లో నీట్‌లో కోట్లాది రూపాయలు అవినీతి జరిగిందని కంప్యూటర్లు లేకుండా క్లాసులు ఎలా పూర్తి చేశారో ఆధారాలతో సహా సెక్రటరీకి అందజేస్తామని హెచ్చరించారు. మంత్రి పదవి చేపట్టిన దగ్గర నుంచి ఇప్పటివరకు ఎక్కడెక్కడ ఎంతెంత అవినీతి చేశారో దానినంతా బయటపెట్టే పనిలో ఉన్నామన్నారు.

'కూటమి ప్రభుత్వం మోసం చేసింది'



పాలకొండ: కూటమి ప్రభుత్వం ఉద్యోగులను వంచించిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఉద్యోగులకు దీపావళి ధమాకా అని హడావిడి చేసి కనీసం డీఏ బకాయిలు, ఇతర బకాయిలు ఇవ్వకుండా ఒక్క డీఏతోనే సరిపుచ్చడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఉద్యోగులకు సుమారుగా రూ. 32 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని.. నాలుగు విడతల సరండెర్ లీవులు ఉన్నాయని తెలిపారు. ఇందులో పోలీసులకు చెందిన బకాయిలే రూ. 835 కోట్లు ఉన్నాయని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.

ఐటీడీఏలను నీరుగార్చారు

- మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



సీతంపేట: కూటమి ప్రభుత్వ హయాంలో ఐటీడీఏలు నిర్వీర్యమయ్యాయని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆరోపించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. కూటమి హయాంలో ఐటీడీఏకు రెగ్యులర్ పీఓను నియమించిన దాఖలాలు లేవన్నారు. ఇన్‌చార్జ్‌లతోనే నడిపిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రెగ్యులర్‌గా ఐఏఎస్ అధికారులను ఐటీడీఏ పీఓలుగా నియమించినట్లు చెప్పారు. కాని కూటమి ఏడాదిన్నర కాలంలో ఐటీడీఏకు చైర్మన్ కూడా ఎవరో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఇన్నాళ్లు ఇక్కడ పనిచేస్తున్న గిరిజన సంక్షేమ కార్యాలయాన్ని (డీడీ కార్యాలయం) కూడా శ్రీకాకుళం జిల్లాకు తరలించడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వెలుగు టీపీఎంయూ కార్యాలయాన్ని పూర్తిగా ఎత్తివేశారన్నారు. ఇక గిరిజన గురుకులంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల స్థానంలో శాశ్వత టీచర్లను నియమించారని చెప్పారు. దీంతో అవుట్ సోర్సింగ్ టీచర్లు వీధిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వారి పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మఒడి వంటి పథకాలు వర్తింపజేశారని... ఇప్పుడు ఆ పథకాలను నిలిపివేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారున. గిరిజన సంక్షేమ మంత్రి మీకు న్యాయం చేస్తామని అవుట్‌సోర్సింగ్ టీచర్లకు హామీ ఇచ్చి అన్యాయం చేశారని ఆరోపించారు. అలాగే ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్లను నియమిస్తామని హామీ ఇచ్చినా నెరవేర్చలేకపోయారని ఎద్దేవా చేశారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మక్కువ: ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని, విద్యార్థుల ఆరో గ్యం పట్ల ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని సాలూరు అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పి.హర్షవర్ధన్ అన్నారు. ఈ మేరకు మండలంలోని ఎర్ర సామంతవలస గిరిజన సంక్షేమ శా ఖ ఆశ్రమ పాఠశాలను మెజిస్ట్రేట్ హర్షవర్ధన్ ఆదివా రం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య సమాచారాన్ని వారాంతపు నివేదికలో పొందుపరచాలని ఆదేశించారు. ప్రతి వారం సంబంధిత పీహెచ్‌సీల వైద్య సిబ్బంది తో వైద్య రిపోర్టులు నమోదు చేయాలని చెప్పారు. పాఠశాల పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్ చేపట్టాలని సూచించారు. విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులకు ఎటువంటి నష్టం జరిగినా పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది బాధ్యత వహించా ల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వేతనదారులకు 200 రోజులు పనిదినాలు కల్పించాలి

సీతానగరం: ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా వేతనదారులకు ఒక్కపూట పనికల్పించాలని, రోజుకు వేతనం రూ.600లు ఇవ్వాలని వ్యవసాయ కార్మికసంఘం మండల కార్యదర్శి సీహెచ్ కృష్ణ అన్నారు. ఈ మేరకు బళ్లకృష్ణాపురంలో మండలవ్యవసాయ కార్మికసంఘం మహాసభ బి.పాపయ్య అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ భూమిలేని నిరుపేద కుటుంబాలకు ఉపాధి కల్పించడానికి ఉపాధి హామీ చట్టం తెచ్చారన్నారు. ఈ చట్టం ప్రకారం ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తున్నప్పటికీ పెరుగుతు న్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనం పెంచాల్సి ఉందని తెలియజేశారు. తాజా గా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజు వారీ వేతనం రూ. 600 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

బిల్లుమడలో కోటి సంతకాల సేకరణ



బిల్లుమడలో సంతకాలు చేసిన పత్రాలను చూపిస్తున్న కార్యకర్తలు

భామిని: మండలంలోని పాత బిల్లుమడలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సిగడాన రాజు ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆదివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాలు ప్రైవేటీకరణ చేయడం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించి, సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నాసిరకం పనులతో గగ్గోలు



నిధులు మంజూరైన బిల్లులు చూపిస్తూ వివరాలు వెల్లడిస్తున్న రావికోన గ్రామస్తులు

పార్వతీపురం రూరల్: మండలంలోని రావికోన పంచాయతీ పరిధిలో స్థానిక కూటమి నాయకులు గత ప్రభుత్వంలో విడుదలైన నిధుతో పనులు నిర్వహించి నాశిరకం పనులతో అవినీతికి పాల్పడి నిధులు కాజేశారని రావికోన గ్రామస్తులు స్థానిక కూటమి నేతల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. గ్రామంలోని పాఠశాల నుంచి లక్ష్మణ అనే వ్యక్తి ఇంటి వరకు మంజూరైన సీసీ రోడ్డుపనుల్లో రూ.3లక్షల 59వేల బిల్లులు చేసిన పదిమీటర్ల మేర పనిని మధ్యలోనే ఆపేశారన్నారు. అలాగే నిర్మించిన రోడ్డుకు ఇరువైపులా పటిష్టత కోసం మట్టి, కంకర వేయకపోవడంతో సీసీరోడ్డు పెచ్చులూడి ధ్వంసమవుతోంని విమర్శించారు. అశాస్త్రీయంగా కట్టిన డ్రైనేజీలతో ఇబ్బందులు పడుతున్నామని అంగన్వాడీ కేంద్రానికి గేట్లు కూడా ఏర్పాట్లు చేయకుండానే నిధులు మింగేశారని కూటమి నేతల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. స్థానిక గ్రామ సర్పంచ్‌కు తెలియకుండా స్థానిక కూటమి నాయకులు మురళి, రామస్వామి, చంటిబాబు, మురళి, వంగపండు త్రినాథ తదితరులు ఈ పనులను చేయించి తమ సొంత లాభాలు పొందినట్లు దుయ్యబట్టారు.

గ్రామాల్లో గాయత్రీ ప్రచార రథం

భామిని: మండలంలోని బిల్లుమడ, నేరడి, తదితర గ్రామాల్లో గాయత్రీదేవి ప్రచార రథం ఆదివారం పర్యటించింది. ఆయా గ్రామాల్లోని భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. బిల్లుమడలో ఈ నెల 26న నిర్వహించనున్న గాయత్రి జ్ఞాన మహాయజ్ఞంపై ఈ సందర్భంగా భక్తులకు వివరించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న యజ్ఞంలో భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.



నేరడిలో గాయిత్రీ దేవీ ప్రచార రథం

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం..

- వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ మోహనరావు



సంతకాలు సేకరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కన్వీనర్ మోహనరావు, తదితరులు

సీతంపేట: పేద వర్గాలకు వైద్య విద్య ఉచితంగా అందాలంటే ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రవేటీకరణను అడ్డుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ సెల్ కన్వీనర్ హెచ్. మోహనరావు పిలుపునిచ్చారు. మండలంలోని వలగెడ్డ, వలసగూడ గ్రామాల్లో ఆదివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన 17 వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం కావాలనే ప్రైవేట్ పరం చేయాలని చూస్తోందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో తక్కువ ఖర్చుతోనే ఎంబీబీఎస్ విద్య అభ్యసించే అవకాశం లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 25 లక్షలకు పెంచితే.. కూటమి సర్కారు ఆ పథకాన్ని అటకెక్కించిందన్నారు. కోటి సంతకాల సేకరణలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పెద్దూరు సర్పంచ్ హిమరక ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల్లో తనిఖీలు



బాణసంచా దుకాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శేఖర్

గుమ్మలక్ష్మీపురం: దీపావళి పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాన్ని తహసీల్దారు ఎస్.శేఖర్ ఆదివారం తనిఖీ చేశారు. నిబంధనల మేరషాపు నిర్వహిస్తున్నదీ లేనిదీ పరిశీలించి, పలు సూచనలు చేశారు. అగ్నిప్రమాదాల నివారణకు ఏర్పాట్లు చేయాలని, టపాసుల ధరల బోర్డు ఏర్పాటు చేయాలని తెలిపారు.

కొమరాడ: మండలంలోని గుమడ సమీపంలో ఏర్పాటు చేసిన క్రాకర్స్(మందుగుండు సామగ్రి) షాపును పార్వతీపురం రూరల్ సీఐ పి.రంగనాథం ఆదివారం తనిఖీ చేశారు. షాపు వద్ద ప్రమాదాల నివారణకు ఏయే చర్యలు తీసుకున్నారన్న అంశాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. దీపావళి సందర్భంగా టపాసులు విక్రయించే వారు విక్రయ ప్రదేశాల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని, అలాగే టపాసులు పేల్చే వారు కూడా ప్రమాదం బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.



కొమరాడ: క్రాకర్స్ షాపు అనుమతి పత్రాలు పరిశీలిస్తున్న సీఐ రంగనాథం

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

గరుగుబిల్లి: ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఎస్ఐ షేక్ ఫక్రుద్దీన్ కోరారు. మండలంలోని ఎర్రన్నగుడి జంక్షన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణపై ఆదివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనాలతో రోడ్లుపైకి వచ్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మితిమీరిన వేగంతో వెళ్లొద్దని, పరిమితికి మించి ప్రయాణికులతో ప్రయాణించరాదని, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యుల సమస్యలు పరిష్కరించండి

గుమ్మలక్ష్మీపురం: పీహెచ్‌సీ వైద్యుల సమస్యలు తక్షణమే పరిష్కరించి, ప్రజలకు వైద్యం అందేలా చూడాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో ఆదివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కొన్నాళ్లుగా తమ న్యాయమైన డిమాండ్‌ల పరిష్కారమే లక్ష్యంగా వైద్యులు సమ్మెబాట పడితే వారిని పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ప్రస్తుతం వైద్యులు సమ్మెలో ఉండడం వల్ల పీహెచ్‌సీకి వచ్చే రోగులకు సకాలంలో సక్రమంగా వైద్యం అందడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఇప్పటికైనా వైద్యుల సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని కోరారు.

'ఐ లవ్ రావివలస' బోర్డు ఏర్పాటు



మండలంలోని రావివలస గ్రామ యువత ఐ లవ్ రావివలస బోర్డు ఏర్పాటు చేశారు. గ్రామంపై తమకున్న ప్రేమను కనబరుస్తూ యువత చేసిన ఈ మంచి పనిని గ్రామస్తులంతా అభినందిస్తున్నారు. ఈ బోర్డు వద్ద పలువురు గ్రామస్తులు సెల్ఫీలు దిగి సోషల్ మీడియాలో షేర్ చేస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. -గరుగుబిల్లి